పిహెచ్‌సిలో వైద్య బృందం తనిఖీలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ స్టాండర్డ్స్ (ఎన్ క్యూ ఎఎస్) వైద్య బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఎన్ క్యూ ఎఎస్ వైద్యాధికారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓపి గది, మందులు గది, ల్యాబ్ గదులను పరిశీలించారు. దీంతోపాటు గర్భిణీల ప్రసవాల ల్యాబ్‌ను, వార్డులను సైతం ఆమె క్షుణ్ణంగా పరిశీలించి గిరిజనులకు, గర్భిణీలకు ప్రభుత్వ అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి పి.రాంబాబు పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న బృందం సభ్యులు

విద్యా రంగంలో సమస్యలను పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లా లో విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు డిగ్రీ కళాశాల నుండి అరకులోయ తహసిల్దార్ కార్యాలయం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.కార్తీక్ మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో కాలేజీలు, పాఠశాల, వసతి గృహంలో అనేక సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆశ్రమ పాఠశాల, కళాశాలలో హెల్త్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో రోజు రోజుకు గిరిజన విద్యార్థుల మరణాలు పెరుగుతూనే ఉన్నాయన్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకనుగుణంగా కాస్మోటిక్స్, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధిక ఫీజులు పెంచడంతో చెల్లించలేక గిరిజన విద్యార్థులు చదువుకు దూరమవు తున్నారన్నారు. విద్యార్థుల మరణాలపై సిట్టింగ్ జడ్జిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అడ్మిషన్స్ ఆన్లైన్ విధానాన్ని రద్దు చేసి ఆఫ్ లైన్ విధానాన్ని అమలు చేయాలని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న అక్షయపాత్ర విధానంతో విద్యార్థులకు సరైన పౌష్టిక ఆహారం అందించే పరిస్థితి ఉండదని, తక్షణమే ఈ విధానం రద్దుచేసి పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు పెంచిన అడ్మిషన్ ఫీజులను తగ్గించాలన్నారు. గిరిజన ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు గిరిజన ప్రత్యేక ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి బలరాం, భీమరాజు, నాయకులు డేవిడ్, శాంతి, కంసుల కొండమ్మ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల వసతి గృహాన్ని ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీను ఆధ్వర్యంలో వసతి గృహం భవనం ఎదుట నిరసన చేపట్టారు. మండల తహసీల్దార్ నరసమ్మకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీను, కే.బాలన్న మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల వసతి భవనాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.నూతన భవనాన్ని నిర్మించి సుమారుగా ఏడాది పూర్తయినప్పటికీ నేటి వరకు హాస్టల్‌ను వినియోగంలోకి తేవక పోవడం సరికాదన్నారు. విద్యార్థినిలు ప్రైవేట్ రూములో అద్దె చెల్లించి విద్యనభ్యసిస్తున్నారన్నారు. కొంతమంది విద్యార్థులు తమ స్వగ్రామం నుండి కళాశాలకు వచ్చే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నూతనంగా నిర్మించిన బాలికల వసతుల గృహంలో అదనంగా బోరుబావి ఏర్పాటు చేయాలని కోరారు. అధికారుల దృష్టికి అనేకసార్లు తెలియజేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా స్పందించి వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. మెను సక్రమంగా అమలు చేయాలని, మరుగు దొడ్లు నిర్మించి, రన్నింగ్ వాటర్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ఆర్. దేవన్న, రాములమ్మ, కామేశ్వరరావు, కొండబాబు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంచంగిపుట్టులో ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై రూ. 6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఎపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పటికే పెరిగిన ధరలతో ప్రనజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ తరుణంలో విద్యుత్ భారం మోపడం అన్యాయమని, ఏనాడో వాడిన కరెంటుకు ఏళ్ల గడిచి పోయాక అదనంగా చార్జీలు చెల్లించాలని ఈఆర్‌సి (ట్రూఅప్) విధానం మోస పూరితమైందన్నారుప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణల్లో దుర్మార్గమైన షరతుల్లో ఇది ముఖ్యమైందని దుయ్యబట్టారు. 2022-23లో వాడిన కరెంటుకు ఈ నవంబర్ నెల నుండి 2026 జనవరి వరకు కొన్ని నెలల్లో యూనిట్‌కు దాదాపు 83 పైసల వరకూ అదనంగా చెల్లించాలని తాజా ఉత్తర్వులతో ఇది విద్యుత్ వినియోగదార్లందరికీ చాలా కష్టమని, నిరుపేదలకు పెను భారం కూడా అవుతుందన్నారు. విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీలిచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తగ్గించడం సంగతి మర్చి పోయి ఇప్పుడు అమాంతంగా 44 శాతం పెంపుదలకు పూనుకోవడం దారుణమన్నారు.గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాన్ని ఈ ప్రభుత్వం కొనసాగించడం గర్హనీయమన్నారు. మాట తప్పి ప్రజలపై వేసిన ట్రూఅప్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా సన్నిబాబు



ప్రజాశక్తి- పెదబయలు: సిపిఎం మండల కార్యదర్శిగా బొండా సన్నిబాబు ఎన్నికయ్యారు. సిపిఎం ఏడవ మండల మహాసభ ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ మహాసభలో నూతన మండల కార్యదర్శిగా బొండా సన్నిబాబు మూడవసారి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కిలో శర్భన్న, బొండా గంగాధరం, బుజ్జిబాబు, నరసయ్య, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఏజెన్సీలో గర్భిణులకు తప్పని తిప్పలు

ఆశా కార్యకర్త సాయంతో కొండమార్గాన డెలివరీకి నడిచి వెళుతున్న గర్భిణి గంగమ్మ

ప్రజాశక్తి- అడ్డతీగల : మండలంలోని వీరవరం పంచాయతీ సీతవరం గ్రామానికి చెందిన చోడి గంగమ్మ అనే గర్భిణికి నెలలు నిండడంతో సమీప బంధువులు అడ్డతీగల 108 వాహనానికి సమాచారం అందజేశారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామం వరకు అంబులెన్స్ రాలేని పరిస్థితిలో ఆశా కార్యకర్త ఏసమ్మ సాయంతో కిలోమీటరు దూరం వరకు కొండమార్గంలో కాలినడకన వెళ్లి, అక్కడి నుంచి 108 సిబ్బంది లక్ష్మి, నవాజ్ సాయంతో అంబులెన్స్‌లో అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లారు. మారుమూల గ్రామాలకు .రోడ్లు మార్గం లేకపోవడంతో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు తరచూ ఇటువంటి ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. కనీసం అంబులెన్స్ వంటి వాహనాలు అత్యవసర సమయంలో గ్రామాలకు వచ్చేలా రోడ్డు సౌకర్యం కల్పించాలని సీతవరం గ్రామస్తులు మొరపెట్టుకుంటున్నారు

పెద్దపులి సంచారంపై భయం భయం

- ధ్రువీకరించిన పోలీసు, అటవీశాఖాధికారులు
- ప్రజలను అప్రమత్తం చేస్తూ ముమ్మర గస్తీ

పహారా కాస్తున్న పోలీసు, అటవీశాఖల సిబ్బంది

ప్రజాశక్తి- కూనవరం : కూనవరం మండలంలో 20 రోజులుగా పులి సంచరిస్తున్నట్లు.అటవీ, పోలీస్ శాఖ సంయుక్తంగా ధ్రువీకరించడంపై ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమౌతున్నాయి. పులిని జాడను ట్రాప్ కెమెరాలతో పట్టేందుకు ప్రయత్నం చేస్తున్నా ఫలితం లేదు. రాత్రి వేళల్లో ఇరు శాఖల సిబ్బంది కలిసి వాహనాలను చట్టి క్రాస్ రోడ్డు, భీమవరం క్రాస్ రోడ్డు వద్ద పహారా కాస్తూ, రాత్రివేళల్లో వాహనాలను వేరే మార్గంలో మళ్లిస్తున్నారు.20 రోజుల క్రితం దూగుట్టలో ప్రత్యక్షమైన పులి, మూడు రోజుల క్రితం నర్సాపురం వద్ద కారుపై దాడి చేసింది. తాజాగా కరకగూడెం పంచాయతీలో బోదునూరు గ్రామంలో ఎద్దును చంపి తిన్న ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో మండల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురౌతున్నారు..అటవీ ప్రాంతం కావడంతో మొత్తం కలియ తిరుగుతూ, ఎక్కడుందో, ఎప్పుడు ఎవరిపై దాడిచేస్తుందో తెలియని అంతుచిక్కని పరిస్థితుల్లో అందరినీ హడలెత్తిస్తోంది.

పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగం నిషేధం

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: పర్యాటక ప్రాంతాలలో ప్లాస్టిక్ వినియోగం నిషేదించామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. పర్యావరణానికి, అడవులకు హాని కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పర్యాటక ప్రాంతాలలో రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్, రహదారులు భవనాలు, వైద్య ఆరోగ్య శాఖ, టూరిజం, రవాణా, అటవీ శాఖ, ఎక్సైజ్, ఇంజనీరింగ్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పర్యాటక సీజన్ ప్రారంభమైందని, పెద్ద ఎత్తున పర్యాటకులు సందర్శిస్తారని చెప్పారు. ఏజెన్సీ ముఖ ద్వారాల వద్ద పర్యాటకుల వాహనాలను, పర్యాటకులను నమోదు చేయాలని సూచించారు. పర్యాటకులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు. పర్యాటక ప్రాంతాలు, అటవీ ప్రాతాలలో క్యాంపు ఫైర్ నిర్వహించకూడదన్నారు. నిర్దేశించిన ప్రదేశాలలో క్యాంపు ఫైర్ నిర్వహించడానికి ముందుగా అనుమతులు పొందాలని చెప్పారు. పర్యాటకులు అత్యధికంగా సందర్శించే పర్యాటక ప్రాంతాలలో వాహనాలు పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనధికారకంగా క్యాంపు ఫైరులు నిర్వహిస్తే మహిళా పోలీసులు, వి. ఆర్. ఓలు, పంచాయతీ కార్యాదర్శులు తనిఖీలు చేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పర్యాటక ప్రాంతాల పరిధిలో గ్రామ స్థాయి, మండల, ఐటిడిఎ, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమిటీలు పర్యాటక ప్రాంతాలను తనిఖీ చేయాలని చెప్పారు. అక్రమంగా మద్యం విక్రయాలు, బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేయాలన్నారు. పర్యాటకులు ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తే తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకోవాలని పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకుండా వాహనాల వేగాన్ని నియంత్రించాలని అన్నారు. పర్యాటక ప్రాంతాలలోని వాణిజ్య సంస్థలు, హొటల్స్, రిసార్టులు, టెంటెడ్ అకామిడేషన్లు యాజమాన్యాలు తప్పని సరిగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. . ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ (వర్చువల్) జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, ఐటిడిఏ పిఓ వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, పాడేరు డి. ఎఫ్.ఓ, పి.వి. సందీప్‌రెడ్డి, డి.ఆర్.ఓ, బి.పద్మావతి, జిల్లా పర్యాటక అధికారి జి.దాసు, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్, శాఖ ఇఇ బాల సుందరబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమాల్ బాషా, వివిద శాఖ అధికారులు, ఎంపిడి ఓలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజలకు కలెక్టర్, పిఒ దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -పాడేరు: జిల్లా ప్రజల జీవితాలు వెలుగులమయం కావాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆకాంక్షించారు. గురువారం దీపావళి పండగ పురస్కరించుకొని జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దీపావళి పండుగ జరుపుకుంటామని, ప్రజలందరూ చెడును వీడి మంచి వైపు పయనించి వారి జీవితాలు వెలుగులమయం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఐటిడి ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పాడేరు ఐటిడిఐ పరిధిలోని ప్రజలందరూ దీపావళి వేడుకలు మంచిగా జరుపుకోవాలన్నారు.భారీ శబ్దాలు వచ్చే బాంబులు, ప్రమాదకర మందుగుండు సామానుల వినియోగించకుండా పర్యావరణ హితంగా దీపావళి జరుపుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న సిఐటియు మండల కార్యదర్శి మొస్య

రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -అనంతగిరి: కేకె లైన్ కొత్తవలస నుండి అరుకు రైల్వే లైన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కిల్లో. మోస్య డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైల్వే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. సంవత్సరం పొడవునా పని కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ సన్యాసిరావు, కార్మికులు జన్ని. దేముడు, పోలయ్య, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపడుతున్న గ్రామస్తులు

శ్రమదానంతో రోడ్డు పనులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయితీ మారుమూల పీవిటీజి గ్రామమైన బిజ్జగూడలో శ్రమదానంతో గ్రామస్తులు రోడ్డు మరమ్మతు చేపట్టారు. ప్రభుత్వాలు మారిన గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం కూడా లేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు తెలిపారు. ,గ్రామంలో ఎవరైనా అనారోగ్యం పాలైతే హాస్పిటల్ తీసుకెళ్లడానికి కనీసం అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదని, దీంతో మూడు కీలోమీటర్ల వరకు డోలి మోతతో తీసుకెళ్ళే పరిస్థితి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని మొర పెట్టుకున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. దీంతో గ్రామస్తులు కలిసి రోడ్డు మరమ్మతు చేస్తున్నామని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సమర్డి బాబురావు, కిల్లో రాంబాబు, కిల్లో రాజు, సుబ్బారావు, ఎస్ ఆనందరావు, కిల్లో సురేంద్ర, కామేష్ పాల్గొన్నారు.

తడకపల్లిలో ఉపాధ్యాయుడిని నియమించాలి

- సిపిఎం ఆధ్వర్యాన చలో కలెక్టరేట్ ఆందోళనకు తల్లిదండ్రులు, విద్యార్థులు సిద్ధం

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం ఎ.దారకొండ పంచాయతీ తడకపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తక్షణమే ఉపాధ్యాయుడిని నియమించకపోతే విద్యార్థులు తల్లిదండ్రులతో ప్రజాప్రతినిధులు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని సిపిఎం గాలకొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు హెచ్చరించారు. బుధవారం పాఠశాల వద్ద విద్యార్థులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడకపల్లిలో ఒకటి నుండి ఐదవ తరగతుల వరకు ప్రస్తుతం14 మంది విద్యార్థులు విద్యాభ్యాసంచేస్తున్నారన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో జూలై నెలాఖరు వరకు పనిచేసిన ఉపాధ్యాయులను ఆగస్టు నెలలో వేరే ప్రాంతానికి అధికారులు బదిలీ చేశారు. వారి స్థానంలో వేరే ఉపాధ్యాయులను నియమించకపోడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రస్తుతం గిరిబాలలు చదువుకు విద్యకు దూరం అవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారన్నారు. సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు వెళ్లి పరిశీలించామన్నారు దీనిపై మండల విద్యాశాఖ అధికారులకు విన్నవించినా స్పందించడంలేదని, గిరిజన విద్యపై పట్ల అధికారులంతా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏ దారకొండ వైస్ సర్పంచ్ ఎం. చంటిబాబు వార్డు మెంబర్ కొండబాబు మాజీ సర్పంచ్ నీలకంఠం విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

కాలం చెల్లిన బస్సులతో కష్టాలు!

- ఘాట్‌రోడ్డులో ఎక్కడికక్కడే నిలిచిపోతున్న సర్వీసులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు.. పట్టని అధికారులు

ప్రజాశక్తి -సీలేరు: విశాఖ నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే మార్గంలో కాలం చెల్లిన బస్సులను తిప్పడంతో పదేపదే ఏదో ఒక అంతరాయం ఏర్పడుతూ అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం విశాఖపట్నం నుంచి భద్రాచలం బయలుదేరి ఆర్‌టిసి బస్ సర్వీస్, మధ్యాహ్నం దుప్పిలివాడ సమీపానికి వచ్చేసరికి బస్సు గేర్ రాడ్డు పనిచేయకపోవడంతో అంతరాయం ఏర్పడి, బ్రేకులు పట్టలేదు. బస్సులో సమస్య తలెత్తినట్లు డ్రైవర్ ప్రసాద్ గుర్తించి, ఆర్టీసీ డిపో అధికారులకు సమాచారం చేరవేశారు. వారి సూచనల మేరకు బస్సును చాకచక్యంగా నడుపుకుంటూ సీలేరు మధ్యాహ్నం 1.30గంటలకు చేరేశాడు. ఆర్‌టిసి అధికారులు ఆదేశాలు మేరకు స్థానిక ప్రైవేట్ మెకానిక్ ఈశ్వరరావును ఆశ్రయించి బస్సులో ఏర్పడిన సాంకేతిక సమస్యను వివరించి, గేర్ రాడ్ మీల్లింగ్స్ అరిగిపోవడం వల్ల బ్రేకులు పట్టడం లేదని ధ్రువీకరించారు. గుర్తించిన లోపాలను వెల్డింగ్ చేసి సరిచేశారు. భోజనాలు విరామానంతరం సీలేరు నుంచి భద్రాచలం బస్సు బయలుదేరడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

మరమ్మతులు చేస్తున్న ప్రయివేటు మెకానిక్

సీలేరులో నిలిచిన భద్రాచలం ఆర్‌టిసి బస్సు

తరచూ అంతరాయంతో అగచాట్లు

విశాఖపట్నం, నర్సీపట్నం, పాడేరు డిపోలకు చెందిన కాలం చెల్లిన, కండిషన్‌లేని బస్సులను ఘాట్ రోడ్డులో పంపుతుండడం వల్ల తరచూ మరమ్మతులు గురవుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. పగటిపూట రాత్రి సమయంలో తిరిగే బస్ సర్వీసులు తరచు మరమ్మతులకు గురై ఎక్కడ ఆగిపోతాయోనని తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు గురై దట్టమైన అటవీ ప్రాంతంలో రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా ఎప్పటికప్పుడే నిలిచిపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు గురవుతున్నారు. కండిషనర్ కలిగిన బస్సులను నడపాలని ప్రయాణికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆర్‌టిసి అధికారులు స్పందించడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే శిరీషాదేవి

ఆసుపత్రిలో వైద్యసేవలపై బాలింతను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి -రంపచోడవరం : ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చే రోగుల పట్ల వైద్యులు, ఇతర సిబ్బంది సఖ్యతతో ఉండి, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. బుధవారం రంపచోడవరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి కమిటీ చైర్మన్ హోదాలో అధ్యక్షత వహించి నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషా దేవి మాట్లాడుతూ ఆస్పత్రిలో మెరుగైన వసతి, సౌకర్యాలను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆసుపత్రికి అవసరమైన వైద్యపరికరాలు, ఇతర సౌకర్యాలను సంబంధించిన సమాచారమిస్తే, ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి కల్పనకు కృషి చేస్తానన్నారు.

సమావేశం అనంతరం ఆసుపత్రిలో వార్డులలో కలియతిరిగి, అక్కడున్న రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి అభివద్ధి కమిటీ సభ్యులు కోసు లచ్చన్న దొర మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులందరూ అందుబాటులో ఉండి సేవలు అందించాలని, ప్రతి చిన్న వైద్యఅవసరానికి రాజమండ్రి, కాకినాడ రిఫర్ చేయకుండా ఇక్కడే మెరుగైన వైద్యం అందించాలని కోరారు.కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషా రెడ్డి, కమిటీ సభ్యులు ఎస్కె.రసూల్ మొహిద్దిన్ (చోటు), సలాది బాపిరాజు, వైద్యులు, సిబ్బంది, శానిటరీ వర్కర్స్ పాల్గొన్నారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణాలు వద్దు

గ్రామానికి దూరంగా తరలించాలి : సిపిఎం

ప్రజాశక్తి- రంపచోడవరం : రంపచోడవరం సెంటరులో ఐటిడిఎ పిఒ బంగ్లా ఎదురుగా నిత్యం జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఉన్న రెండు మద్యం దుకాణాల వల్ల మహిళలు ఇతర ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన.కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కన 100 మీటర్లు దూరం కూడా లేకుండా వైన్ షాపులకు ఎలా పర్మిషన్ ఇస్తారన్నారు. వెంటనే వాటిని ఊరికి దూరంగా పెట్టాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం బస్‌స్టాండ్ పక్కన ఉన్న మద్యం దుకాణం వల్ల బస్‌స్టాండ్, కాలేజ్, హైస్కూల్, హాస్పిటల్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఉండడం వల్ల జనానికి ఇబ్బందులు ఉంటాయన్నారు. ఐటిడిఎ పిఒ బంగ్లాకు ఎదురుగా ఉన్న మద్యం దుకాణాన్ని కూడా ఊరికి దూరంగా తరలించాలని కోరారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

మోకాళ్లపై నిల్చొని దండం పెడుతూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

విద్యుత్ మీటర్లు కోసం వినూత్న నిరసన

ప్రజాశక్తి - అనంతగిరి: అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని రొంపల్లి పంచాయతీ భూరిగ. చిన్నకోనెల గ్రామాల ప్రజలకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలంటూ బుధవారం కాశీపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆయా గ్రామ గిరిజనులు మోకాళ్లపై నిల్చొని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ సోమెల అప్పలరాజు, గ్రామస్తులు కె.సింహాచలం బి.పెంటయ్య మాట్లాడుతూ తమ పోరాట ఫలితంగా ఈ మధ్యకాలంలో తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారని తెలిపారు. అయితే రెండు గ్రామాల్లో 60 కుటుంబాలు ఉండగా నాలుగు కుటుంబాలకు మాత్రమే మీటర్లు బిగించారని తెలిపారు. మిగతా వారికి మీటర్లు బిగించకపోవడంతో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇళ్లలోకి విషపూరిత కీటకాలు ప్రవేశిస్తున్నాయని తెలిపారు. రెండు రోజుల క్రితం పెంటయ్య ఇంట్లోకి అర్ధరాత్రి కట్లపాము ప్రవేశించిందని పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎంపిడిఒకు వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

చెత్తా చెదారం తొలగించాలని వినతి

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి ఇంజినీరింగ్ కార్యాలయం వరకు డ్రైనేజీలో చెత్తాచెదారం తొలగించాలని, వీటి మరమ్మత్తులు చేపట్టాలని మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ, ఆదివాసి గిరిజన సంఘం నేతలు ఎం.ఎం శ్రీను, సొలగం గాసిరామ్ దొర, దుర్గవీధి వాసులు బుధవారం స్థానిక ఎంపీడీవో శ్రీ సాయి హర్షకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయంపై ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను మాట్లాడుతూ,గత కొన్ని సంవత్సరాలుగా డ్రైనేజీలో మద్యం సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, బాటిల్లు వంటి చెత్త చెదారాలు కూరుకుపోయాయని, దీంతో డ్రైనేజీ నుంచి దుర్గంధం వెదజల్లుతుందని తెలిపారు. దీంతో, దోమల అధికమై డెంగ్యూ, మలేరియా వ్యాధులకు గురవుతున్నామని పేర్కొన్నారు. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వరద నీరుతో పాటు చెత్తాచెదారం రహదారిపైకి వచ్చి చేరుతుందని తెలిపారు. తక్షణమే డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి మెరుగుపరచాలని విన్నవించారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎం.నర్సింగ్ పడాల్, రెయ్యల నాగభూషణం, జొయో తదితరులు ఉన్నారు.

అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలి

తహశీల్దార్‌కు ఆదివాసీ గిరిజన సంఘం వినతి

వినతిపత్రం ఇస్తున్న నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండల కేంద్రంలోని అక్షయ ఇన్ లాడ్జి పక్కన పశుసంవర్ధక శాఖ స్థలంలో పంచాయితీ సర్పంచ్ నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ అక్రమ కట్టడాలను నిలుపుదల చేసి, టిడిపి నిధులతో నిర్మించి స్థానిక నిరుద్యోగులకు షాపింగ్ కాంప్లెక్స్ కేటాయించాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎదురుగా అక్షయ ఇన్ లాడ్జి పక్కన నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు నిలుపుదల చేయాలని తహశీల్దార్ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, శరభగూడ కంబిలేన్సుగుడ, తాంగులగూడ గ్రామస్తులు, నిరుద్యోగులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, పశుసంవర్ధక శాఖ కు సంబంధించిన స్థలంలో అక్రమంగా నిర్మాణం చేస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ స్థలాన్ని ఐటిడిఏ స్వాధీనం చేసుకొని ఐటిడిఏ నిధులతో నిర్మాణం చేసి స్థానిక గిరిజన నిరుద్యోగులకు షాపింగ్ కాంప్లెక్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పంచాయతీ పాలకులు ఎక్కడి డబ్బులతో నిర్మాణం చేస్తున్నారో తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. పెదలబుడు పంచాయతీ పరిధిలో గ్రామంలో డ్రైనేజ్, సిసి రోడ్డు, తాగునీరు, వీధిలైట్లకు నిధులు లేవని చెప్పిన పాలకులు ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి డబ్బులు ఎక్కడివి అని ప్రశ్నించారు. గ్రామసభ పేసా కమిటీ ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ఎలా నిర్మిస్తారన్నారు.నిరుద్యోగులు చిన్న రేకు షెడ్డు పెట్టుకొని వ్యాపారం సాగిస్తుంటే హుటాహుటిన తొలగించే రెవిన్యూ అధికారులు తమ కార్యాలయం పక్కన ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న కట్టడాలపై ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని అక్రమ కట్టడాలు స్వాధీనం చేసుకుని ఐటిడిఏ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఆదివాసీ నిరుద్యోగులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కె జగన్నాధం,కె.మగ్గన్న, టి.హరి, కిల్లో సహదేవ్, గ్రామస్తులు పెద్దలు మొంగునాయుడు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ శ్రేయస్సుకు దోహదపడాలి

జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: విద్యార్థులందరూ మంచి లక్ష్యంతో ఉన్నత స్థితికి ఎదగాలని, సమాజానికి ఉపయోగపడాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ హితబోధ చేసారు. బుధవారం స్థానిక పరభుత్వ జూనియర్ కళాశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోరి వికాస్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు మనసులో చెడు ఆలోచనలు లేకుండా మంచి ఆలోచనలు పెంచుకోవాలన్నారు. జీవితంలో భవిష్యత్తు కోసం మంచి లక్ష్యాన్ని నిర్దేసించుకొని ఉన్నత స్థానాలకు ఎదగడానికి ప్రణాలికాయుతంగా సిద్ధం కావాలని సూచించారు. అదేవిధంగా మంచి ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చెడు వ్యసనాల జోలికి వెళ్ళకుండా తగు జాగ్రత్తలు వహించాలని కోరారు. ఆడ పిల్లలు గుడ్ టచ్, బేడ్ టచ్ గూర్చి అవగాహన పొందాలని, టీనేజ్ అంటే తెలిసీ తెలియని వయసని, ఈ వయసులో అనాలోచిత చర్యలకు పాల్పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. జిల్లాలో పేదరికంతోనే బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటి నుండి బయటపడాలంటే అందరూ బాగా చదువుకొని ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవాలని సూచించారు. జిల్లాలో గంజాయికి బానిశలవుతున్న వారి సంఖ్య అధికంగా ఉందని, మందుల తయారీలో వినియోగించే గంజాయిని మత్తు పదార్థంగా వినియోగించడం బాధాకరమన్నారు. ఎవరైనా గంజాయి పండించినా, అమ్మినా, వినియోగించినా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.డి-అడిక్షన్ కేంద్రంలో డాక్టర్లు ఉత్తమ చికిత్సలు అందిస్తారని, అక్కడ కౌన్సిలర్లు వారికి అవగాహన కల్పిస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్. సూర్యలక్ష్మి, డిఎంహెచ్ఓ జమాల్ భాష, డిఆర్డిఎ పిడి వి.మురళి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.దీనబంధు, డిసిపిఓ సద్దు, డిపిఆర్ఓ పి. గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డులో చదువులు

షెడ్డులో చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు : మండలంలో నక్సల్ ప్రభావిత ప్రాంతమైన రంగబయలు పంచాయతీ పరిధిలోని జోడిగుమ్మ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుమారు 32 మంది ఆదివాసి పివిటిజి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కనీసం పాఠశాల భవనం లేక పశువుల పాక వంటి రేకుల షెడ్డులో విద్యాబుద్ధులు నేర్చుకోవలసిన దుస్థితి నెలకొంది. మాతృభాష విద్యా వాలంటరీ తో ప్రతిరోజు పాఠశాల నడుపుతున్నారని రంగబయలు సర్పంచ్ ఐతన్న తెలిపారు. కనీసం పాఠశాల భవనం లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి జోడిగూడ గ్రామంలో పాఠశాల భవనం నిర్మించాలని గ్రామ నాయుడు , గొల్లోరి గోపి, గొల్లూరి బూపన్న, వంతల దళపతిలు ప్రభుత్వాన్ని కోరారు.

4జి ఏర్పాటుకు తెచ్చిన పరికరాలు

బిఎస్ఎన్ఎల్ 4జి సేవలకు సన్నద్ధం

ప్రజాశక్తి హుకుంపేట:- మండల కేంద్రంలోని బిఎస్ఎన్ఎల్ 4జి సేవల పనులు బుధవారం చేపట్టారు. గతంలో ఉన్నటువంటి 2జి, 3జీ, సిగ్నల్ సేవలు తొలగించి 4జి సిగ్నల్ సంబంధించిన నెట్ సౌకర్యాలు ఏర్పాటుకు పనులు చేపట్టారు. గత కొంతకాలంగా 2జి, 3జీ, సిగ్నల్ అందక వినియోగదారులు ఇబ్బందులు పడేవారు. బ్యాంకులలో, ప్రభుత్వ కార్యాలయంలో నెట్వర్క్ సదుపాయాలు సరిగా లేక ఇబ్బంది పడేవారు. కరెంటు పోతే సిగ్నల్ లేకపోవడం, నెట్ అంతరాయం ఏర్పడడం వంటి సమస్యలు తలెత్తేవి. 4 జి సేవలు రావడంతో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం లేకుండా సేవలు అందుబాటులో ఉండేందుకు ఉపయోగపడతాయి. పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులో వస్తే ప్రజలకు సాంకేతిక సమస్యలు తొలగిపోతాయి. నవంబర్ నెల నుంచి నెట్ సిగ్నల్ ఏ విధంగా ఉంటాయో వేచి చూడాలి.

అరకులో బాణసంచా విక్రయాలు

ప్రజాశక్తి డుంబ్రిగుడ:- దీపావళి పండుగను పురస్కరించుకొని మండలంలోని అరకు సంత బయలులోని సంత షెడ్లులో దుకాణాలు ఏర్పాటుచేసి బుధవారం బాణసంచా విక్రయాలు చేపట్టారు. పండగను ఘనంగా జరుపుకోవడానికి మండలంలోని పలు గ్రామాల నుంచి గిరిజనులు బాణ సంచాల సామగ్రిలను కొనుగోలు చేసేందుకు తరలివచ్చారు. గతంలో అరకులోయ మండల కేంద్రంలోని బాణ సంచాల విక్రయాలను చేసేవారు. మండలంలోని అరకు సంతబయలులో ఏర్పాటు చేయడంతో మండల వాసులకు బాణ సంచా సామగ్రిలను కొనుగోలు చేసుకునేందుకు అనుకూలంగా ఉన్నట్లు స్థానికులు అంటున్నారు.

స్కిల్ సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి-అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం సిబ్బంది కి స్కిల్ సెన్సస్ సర్వే. నైపుణ్య గణన పై శిక్షణ ఇచ్చామని ఎంపిడిఓ ఎవివి.కుమార్ పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది ప్రతి ఇంటింటికి వెళ్లి 15 నుండి 59 సంవత్సరాలు లోపు వయస్సు గల ప్రతి ఒక్కరికీ నైపుణ్య గణన సర్వే చేసి ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. ఆన్లైన్ లో నమోదు అనంతరం వారి ఆశక్తుల మేర ప్రభుత్వం తదుపరి నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి ఉపాది అవకాలు కల్పిస్తుందన్నారు.నెల రోజుల పాటు సచివాలయం సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని యువతి. యువకులు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-హుకుంపేట:- మండల కేంద్రంలోని పట్టం పంచాయతీ గ్రామంలోని బుధవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టారు. టిడిపి ఎస్టి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొర్ర సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వం నమోదుతో కార్యకర్తకు భీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ శతక బొంజు బాబు, నాయకులు కూడేలి నూకరాజు, కర్రీ బాబు, శుక్రన్న పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ మహిళలకు వరం

ప్రజాశక్తి - చింతపల్లి :- సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకువచ్చిన ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ పథకం గృహిణిలకు వరమని తెదేపా మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కిలో పూర్ణచంద్రరావు, ఆండ్రాబు లక్ష్మణ్ అన్నారు. ఆ పార్టీ చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, ఇతర నాయకులతో కలిసి బుధవారం మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి ఆర్థిక భారాన్ని తగ్గించి, గృహిణిలకు మేలు కలిగే విధంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ పథకంతో ప్రతి కుటుంబంలోనూ ఏడాదికి సుమారు 2500 కు పైగా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పడాల సత్తిబాబు, కిముడు అప్పారావు, బేతా నాగు తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో కురుస్తున్న వర్షం

భారీ వర్షం

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలంలోని సీలేరు, దుప్పిలివాడలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వరితోపాటు ఇతర పంటలు ప్రస్తుతం చివరిదశకు చేరుకోవడంతో ఇపుడు వర్షం కురవడంపై రైతులుఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో భారీ వర్షాలతో వరి ఇతర పంటలు కొట్టుకుపోయి రైతులకు భారీ నష్టం కలిగిన విషయం తెలిసిందే. మిగిలిన వరి పైర్లు ఇపుడు కురుస్తున్న వర్షాలతో గిరిజన రైతులు భయాందోళన గురవుతున్నారు. మంగళవారం సీలేరు, దుప్పిలివాడ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా, మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వాతావరణ మార్పులు చోటుచేసుకుని చింతపల్లి క్యాంప్, లైకాన్ పూర్, చంద్రుపల్లి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

చిన్నారుల వ్యాక్సినేషన్‌పై గణన

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం సీలేరు పిహెచ్‌సివైద్యాధికారి ఖాదరు మస్తాన్ వలీ ఆధ్వర్యంలో ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాక్సినేషన్‌పై సర్వే నిర్వహించి, గణన చేపట్టారు ఈ సందర్భంగా డాక్టర్ వలీ మాట్లాడుతూ అధికారుల ఆదేశాలు మేరకు పిహెచ్‌సి పరిధిలో క్షేత్రస్థాయిలో హెడ్ కౌంట్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు ఎంతమందికి వేశారు? ఎంతమంది మిగిలి ఉన్నారు? అనే కోణంలో సిబ్బందితో ముమ్మరంగా సర్వే చేస్తున్నామన్నారు. మారుమూల గ్రామాల్లో సిబ్బంది గణన సర్వే వేగవంతం చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రికి వస్తే సరైన వైద్య సేవలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అనారోగ్యానికి గురైన ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా వైద్య సేవలు పొందాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కే. జోజిబాబు, సత్యనారాయణ, ఆరోగ్య పర్యవేక్షకులు కే. త్రినాథ్, బాలామణి ఆరోగ్య సహాయకులు రాజబాబు. ఆరోగ్య కార్యకర్తలు దేవి కెవిఎన్. కుమారి, అరుణ కుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

724 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - సీలేరు: జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బుధవారం జీకే వీధి మండలం రింతాడ గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్‌లోని 6 తరగతి నుంచి 10వ తరగతివరకు 724 మందికి విద్యార్థినులకు కంటి వైద్య నిపుణులు డాక్టర్ టి.విశ్వేశ్వర్ రాజు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 21మందికి దృష్టి లోపంతో ఉన్నట్లు గుర్తించి వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు. స్వల్ప దృష్టిలోపం ఉన్న 35 మంది విద్యార్థులు గుర్తించి డ్రాప్స్ ఉచితంగా పంపిణీ చేశారు. దృష్టిలోపం రాకుండా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏ విటమిన్ ఉన్న పోషకాలను తీసుకోవాలని విద్యార్థులు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. పాపయమ్మ వార్డెన్ జె. విజయ్ కుమారి, పిఎంయుఒ ఎన్ వి. రమణ, యుఒ కె.సింహాచలం, ఎఎన్ఎం ఎల్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలు లైసెన్సులు పొందాల్సిందే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాలల సంరక్షణ కేంద్రాలు జువైనల్ జస్టిస్ చట్టం సెక్షన్ - 41 ప్రకారం విధిగా లైసెన్సులు పొందాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. బుధవారం ఎంవిపి.కాలనీలోగల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

2న విశాఖకు సిఎం చంద్రబాబు రాక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నవంబర్ 2న విశాఖ జిల్లాకు వస్తున్నారని, ఆ రోజు 100 రోజుల ప్రణాళిక, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులపై జిల్లా అధికారులతో నేరుగా సమీక్ష నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. అధికారులంతా ఆయా శాఖల పరిధిలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, 100 రోజుల ప్రణాళికలో చోటు కల్పించిన అంశాలు, ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకోవాలని, అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం జిల్లాలోని అన్ని విభాగాల అధికారులతో కలెక్టర్ ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. ఒక్కో విభాగం తాలూకా నివేదికలను పరిశీలించారు. మార్పులు చేర్పులపై సూచనలు చేశారు. జిల్లా ప్రగతికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సంక్షిప్త రూపంలో నివేదికలను తయారు చేయాలని, ముఖ్యమంత్రి అడిగిన అంశాలకు సూక్ష్మంగా సమాధానం ఇచ్చేలా సంసిద్ధం కావాలని హితవు పలికారు. తమ శాఖల పరిధిలో రాష్ట్ర స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలు, అనుమతుల విషయంలో ఏమైనా పెండింగ్ ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని చెప్పారు. అధికారులు ప్రతి అంశంపైనా స్పష్టతతో, పూర్తి అవగాహనతో ఉండాలని సూచించారు. ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని జిల్లా రెవెన్యూ అధికారికి చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ అధికారికంగా ఇంకా వెలువడాల్సి ఉందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, సిపిఒ శ్రీనివాసరావు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఎఒ ఈశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధరావళి

పెరిగిన టపాసుల ధరలు
జిఎస్‌టి కారణమంటున్న వ్యాపారులు
సామాన్యునికి భారంగా బాణసంచా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బాణసంచా, టపాసుల ధరలు భారీగా పేలాయి. గత ఏడాదితో పోలిస్తే అన్ని ధరలూ 25 శాతం నుంచి 30 శాతం వరకు పెరిగాయి. ఏది కొనుగోలు చేయాలన్నా రూ.100కు తక్కువ లేదు. ఎయు గ్రౌండ్స్, ఎంవిపి.కాలనీ, గాజువాక ప్రాంతాలలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలకు వెళ్లిన వారు ధరలను చూపి చెమటలు పడుతున్నారు. మతాబుల నుంచి థౌజండ్ వాలా, చిచ్చు బుడ్లు.. ఇలా ఏది చూసినా ధరలు విపరీతంగా పెరిగినట్లు కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు. రవాణా, పన్నులు, పర్మిట్లు, షాపులు ఏర్పాటు ఖర్చులు, కెమికల్స్ ధరలు పెరగటం వల్ల మతాబుల ధరలు పెంచక తప్పలేదని వ్యాపారులు అంటున్నారు. హోల్‌సేల్ వ్యాపారుల నుంచి అధిక ధరకు వీటిని కొనుగోలు చేసి జివిఎంసి, ఫైర్, పోలీస్, విద్యుత్ శాఖ వగైరా వాటి నుంచి అనుమతులు పొందడానికి గత ఏడాదితో పోలిస్తే ఈసారి అధికంగా ఖర్చులు పెరిగాయని అంటున్నారు. ఈ పరిస్థితులలో సామాన్య, మధ్యతరగతి ప్రజలు టపాసులు కొనుగోలు చేయగలరా ? వాటిని కాల్చగలరా ? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

విశాఖ నగరంతో పాటు జిల్లాలో ఏటా దీపావళి పండగను ఘనంగా జరుపుకుంటారు. బాణసంచా ఎప్పుడూ భారీగానే పేలుతుంది. డబ్బులు లేకపోయినా.. అప్పు చేసైనా ప్రజలు పండగ జరుపుకుంటారు. ప్రజల్లో ఉన్న ఈ ఆసక్తి కారణంగా నగరంలో ఏటా కోట్ల రూపాయల మేర బాణసంచా వ్యాపారం సాగుతోంది. ఈ ఏడాది గరిష్ఠంగా రూ.10 కోట్ల మేర బాణసంచా వ్యాపారం జరగవచ్చని భావిస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో వ్యాపారులు భారీ స్థాయిలోనే బాణసంచా స్టాకు తీసుకువచ్చారు. సంప్రదాయంగా ప్రజలు వినియోగించే బాణసంచా మాత్రమే కాకుండా కొత్తకొత్త పద్ధతుల్లో తయారు చేసిన బాణసంచాను కూడా మార్కెట్‌లో అమ్ముతున్నారు.

ధరలు ఇలా..

ఇక ధరల విషయానికొస్తే.. ఎక్కువగా పిల్లలు ఇష్టపడే కాకర పువ్వొత్తులు బాక్స్ పెద్ద సైజు రూ.150, చిన్న సైజు రూ.80 ఉంది. అయితే మంచి కంపెనీకి చెందినవి రూ.300 ధర ఉన్నాయి. తాళ్ల చిన్న పెట్టె రూ.40, పెద్దవి రూ.80, సీమ టపాసులు చిన్న బాక్స్ రూ.80 ధరలో ఉంది. భూ చక్రాలు గత ఏడాది రూ.70 ఉండగా ఇప్పుడు రూ.100 నుంచి రూ.120 మధ్య ఉన్నాయి. 5000 వాలా బాంబు దండ గతంలో రూ.1200 నుంచి రూ.1300 ఉండేది. ఇప్పుడు రూ.1500 నుంచి రూ.1800 పలుకుతోంది. 1000 వాలా మంచి క్వాలిటీ గతంలో రూ.రెండు వేలు ఉండేది. ఇప్పుడు అదే రూ.2500కు చేరింది. అందులో సాదా రకం రూ.1800 వరకు ఉంది. చిచ్చుబుడ్డిలు చిన్న సైజు రూ.10 ఉండగా గత ఏడాది కంటే 20 శాతం అధికమైంది. బాణసంచా ధరలు తీవ్రస్థాయిలో పెరగడానికి జిఎస్‌టి కూడా కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

విశాఖలో ఓ బాణసంచా దుకాణం వద్ద సాగుతున్న అమ్మకాలు

దుకాణాల ఏర్పాటులో అవినీతి ?

నగరంలో, ముఖ్యంగా ఎయు గ్రౌండ్స్‌లో బాణసంచా దుకాణాల ఏర్పాటు చేసిన వ్యాపారస్తుల నుంచి జివిఎంసి పాలకవర్గం పెద్దలు లక్షలాది రూపాయలు లంచాలుగా తీసుకున్నారని వ్యాపారులు బహిరంగంగానే చెబుతున్నారు. కొందరు వ్యాపారులు ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదులు కూడా చేశారు. దీపావళి స్టాల్స్ ఏర్పాటులో వివిధ విభాగాలకు చెందిన అధికారులకు మామూళ్లు ఉంటాయనేది బహిరంగ రహస్యం. అందుకోసం ఒక్కొక్క వ్యాపారి రూ.లక్షకు పైగా ఖర్చు చేయక తప్పదని సమాచారం. ఈ ఏడాది ఎయు గ్రౌండ్స్‌లో బాణసంచా స్టాల్స్ ఏర్పాటు చేయడం కోసం 536 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 10 తిరస్కరణకు గురికాగా 526 దుకాణాలకు అనుమతులు లభించాయి. ఎంవిపిలో 32 దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్టు అగ్నిమాపక అధికారి ఒకరు తెలిపారు. ఎయు గ్రౌండ్స్‌లోగానీ, ఎంవిపి, గాజువాక ప్రాంతాల్లోగానీ అనుమతులు పొందిన స్టాల్స్ సంఖ్య కంటే అధికంగా ఏర్పాటు కావడం గమనార్హం.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీషా దేవి

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం : అనారోగ్య పీడితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థికసాయం చెక్కులను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అందజేశారు. ఎమ్మెల్యే శిరీషాదేవి చొరవతో విఆర్ పురం మండలం రేఖపల్లికి చెందిన షేక్ ఇబ్రహీంకు వెన్నెముక ఆపరేషన్ జరగ్గా, ఆయన కుటుంబానికి రూ.87,056 అలాగే (కిడ్నీ సమస్యతో బాధపడుతూ వైద్యసేవలు పొందిన రాజుపేట గ్రామస్తులు వడ్డనపు సత్యనారాయణ కుటుంబానికి రూ.56,273 ఆర్థికసాయం చెక్కులను తన నివాసం వద్ద అందజేశారు.కార్యక్రమంలో తెలుగు యువత ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నరేష్ఉన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల మూడు రోజుల శిక్షణ

ప్రజాశక్తి - అడ్డతీగల : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో ఉపాధ్యాయులకు మూడు రోజుల మొదటి విడత శిక్షణ బుదవారంతో ముగిసింది. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు వివిధ విద్యా సామర్థ్యాలలో వెనకబడి ఉన్న మూడు స్థాయిల విద్యార్థులకు టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ శిక్షణలో భాగంగా మండలంలోని అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చినట్లు ఎంఇఒ శ్రీనివాస్ తెలిపారు. ఈ శిక్షణ ద్వారా తెలుగులో కనీసం చదవడం, రాయడం లేనివారికి, గణితంలో అంకెలు,సంఖ్యలు చతుర్విధ ప్రక్రియలు చేయలేకపోతున్నారో వారికి సులభంగా బోధించుటకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సిఆర్‌పి కెవి.రాఘవులు, నాగప్రసాద్, .ఈశ్వరరావు, మద్దిరెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలలో పాఠశాలల్లో ఆచరణలో అమలు చేయాలని కోరారు.

మారేడుమిల్లి: స్థానిక రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాసామర్థ్యాలను మెరుగుపరిచే విధంగా టెక్నికల్ అట్ రైట్ లెవెల్(టిఎఆర్ఎల్)పై ఉపాధ్యాయులకు మూడురోజుల శిక్షణ బుధవారంతో ముగిసిందని ఎంఇఒ కె తాతబ్బాయి దొర తెలిపారు. మూడవ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు తెలుగు, రాయడం, చదవడం, గణితం లో అంకెలు సంఖ్యలను చతుర్విధ ప్రక్రియలపై సులభతరమైన బోధనకు ఉపాధ్యాయులకు ఈ శిక్షణనిచ్చారు.కార్యక్రమంలో ఆర్ పి లు లండ వెంకటేశ్వర్లు, ఎస్ దేవ ప్రకాష్, ఎం జగజీవన్ సిఆర్‌పిలు డి కమలాకర్, బి మధు పాల్గొన్నారు.

తీర ప్రాంత పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర సముద్ర తీర ప్రాంతాన్ని కలుషితం కాకుండా మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య జివిఎంసి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆర్‌కె.బీచ్ పరిసర ప్రాంతాలను జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీచ్‌లో కాలువలు, గెడ్డలు ద్వారా సముద్రంలోకి చేరే మురుగు నీరు ఒక కిలోమీటర్ వరకు పైపులైను ద్వారా చేరేలా చర్యలు చేపట్టాలని, తద్వారా సముద్ర తీర ప్రాంతం దుర్వాసన రాకుండా పరిశుభ్రంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాద్ రాజు, పర్యవేక్షక ఇంజినీరు కెవిఎన్.రవి పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ దుకాణాలను పరిశీలించిన సిపి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఎయు మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను బుధవారం పరిశీలించారు. బాణసంచా అమ్మేదగ్గర, కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిబంధనలు అతిక్రమించరాదన్నారు.